క్లుప్తంగా

జీవో నంబర్-3కు చట్టబద్ధత కల్పించాలి

కొయ్యూరు: జీవో నంబర్-3కు చట్టబద్ధత కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వం జీవో-3కు విధిగా చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ నెల తొమ్మిదిన ఆదివాసీ హక్కుల దినోత్సవంగా రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని కోరారు. గిరిజనులకు కేటాయించిన నిధులు వారికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

మండల ఆదివాసీ సంఘం నూతన కమిటీ

రంపచోడవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, రంపచోడవరంలో ఆదివాసీ (గిరిజన)ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ ఎన్నిక ఆదివారం రంపచోడవరంలో జరిగింది. ఈ ఎన్నికలలో ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన జిల్లా స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి మొత్తం 22 మండలాల నుంచి 12 ఆదివాసీ తెగల ఉద్యోగ, ప్రజా, విద్యార్థి నాయకులు 100 మంది కి పైగా హాజరైయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆదిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫకీరు దొర, జిల్లా కోశాధికారిగా రాజబాబు, అగ్గి దొర, కృష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పొట్టి దొర, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

డుంబ్రిగుడ: ఏజెన్సీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించుకొని ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటునిచ్చుకొవాలన్నారు.

వంతెన నిర్మించాలని డిమాండ్

డుంబ్రిగుడ: మండలంలోని శీలంగొంది రోడ్డు చంపాపట్టి గెడ్డపై వంతెన నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.బి.పోతురాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శీలంగొంది రోడ్డు, చంపపట్టి గడ్డ వద్ద నిర్మించిన కాజ్‌వే 2014లో హుద్‌హుద్ తుపానుకు కొట్టుకుపోయిందన్నారు. వంతెన నిర్మించకపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరారు.

వ్యసనాలతో జీవితం నాశనం



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ రామారావు

ఎటపాక: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రామారావు సూచించారు. ఆదివారం డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు తీసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఎస్‌ఐ పార్థసారధి, వైస్ ప్రిన్సిపాల్ హథీరాం, కరస్పాండెంట్ రాజశేఖర్ తదితరులున్నారు.

ఆదమరిస్తే... అంతే



గుమ్మసిరగంపుట్టు వద్ద కోతకు గురైన రహదారి

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్అండ్‌బీ మార్గంలో గుమ్మసిరగంపుట్టు గ్రామం వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కోతకు గురై రంధ్రం ఏర్పడింది. ఈ మార్గంలో రోజూ వందల కొద్ది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ఏ మాత్రం ఆదమరిస్తే భారీ ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోతకు గురైన రహదారి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



తోటకూరపాడులో ఇరుకైన గదిలో విద్యార్థులు



జోలాపుట్టు ఆశ్రమ పాఠశాలలో ఇరుకు గదిలో విద్యార్థులు



బొడ్డగొందిలో ఆరుబయటే తరగతులు



మొండికోటలో పాఠశాల దుస్థితి

సమస్యలతో తడబడి

- గాడి తప్పిన సర్కారు విద్య
- విద్యార్థుల సంక్షేమానికి కొత్త ప్రభుత్వం పాతర
- పేదింటి పిల్లలకు దూరమవుతున్న విద్య

పాడేరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తెచ్చిన సంస్కరణాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగించలేకపోతోంది. గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులను తీసుకువచ్చారు. ప్రత్యేకంగా పాఠశాలల్లో కోట్లాది రూపాయాలను వెచ్చించి అన్ని రకాలుగా కార్పోరేట్ సౌకర్యాలు కల్పించారు. దీంతో విద్యార్థులు సర్కారు బడుల్లో చేరేందుకు క్యూ కట్టారు. దీనికి తోడు ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యా కానుక కిట్లు అందించేవారు. పాఠశాలల ప్రారంభం నాటికే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు ఇవ్వడంతో పాటు జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమ చేసేవారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్లేవారు. పాఠశాలల్లో కూడా శుచి శుభ్రతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించేవారు. రెండు నెలల క్రితం కూటమి ప్రభుత్వంలో పూర్తిగా మారిపోయింది. విద్యా వ్యవస్థ మళ్లీ ఐదేళ్ల మునుపటి రోజులు కనిపిస్తోంది. ఈ ఏడాది జూలై నెల పూర్తయినా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు ఇంకా అందలేదు. టీచర్ల కొరత ఉన్నప్పటికి విద్యా శాఖ అధికారులు ఉన్నవారినే అక్కడక్కడ సర్దుబాటు చేశారు. గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవహారిస్తుండడంతో నాణ్యమైన విద్య బోధన, వసతి, విద్యా కానుక కిట్లు అందడం లేదనే బాహాటంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలం: పాడేరు

- మొత్తం పాఠశాలల సంఖ్య : 160
- విద్యార్థుల సంఖ్య : 13,000 మంది
- విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు : 11,000
- ఇప్పటి వరకు విద్యార్థులకు పంపిణి చేసిన పాఠ్యపుస్తకాలు : 10,305
- విద్యార్థులకు కావాల్సిన విద్యా కానుక కిట్లు : 11,000
- పంపిణి చేసిన కిట్లు : 10,305
- మండలంలోని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య : 3
- టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు : 5 ఎస్జీటీలు

మండలం: చింతపల్లి

- మండలంలో మొత్తం పాఠశాలలు : 209
- పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు : 14,500 మంది
- విద్యా కానుక కిట్లు ఇంకా రెండు వేల మంది విద్యార్థులకు పంపిణి చేయాల్సి ఉంది
- మండలంలో పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టలేదు.

మండలం: కొయ్యూరు

- మండలంలోని మొత్తం పాఠశాలలు: 153
- మండలంలోని మొత్తం విద్యార్థులు : 8,463
- ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు: 151
- ఆశ్రమ, జీపీఎస్(టీడబ్ల్యు) పాఠశాలల్లో ఉపాధ్యాయులు- 295
- మండలంలోని విద్యా కానుక కిట్లు పూర్తిగా మండలానికి రాలేదు. 1 నుంచి 5 తరగతులు చదివే వారికి మాత్రమే బ్యాగ్‌లు వచ్చాయి. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులుక నేటికి బ్యాగ్‌ల పంపిణీ జరగలేదు.
- మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో 25 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. మొత్తం 171 మంది ఉండాల్సి ఉండగా151 మంది మాత్రమే ఉన్నారు. జీపీఎస్‌టీడబ్ల్యూ పాఠశాలల్లో ఐదు ఖాళీలున్నాయి. మొత్తం 295మంది ఉపాధ్యాయులకు 290 మంది ఉన్నారు.

మండలం: రాజవొమ్మంగి

- మండలంలోని 97 పాఠశాలలున్నాయి.
- మండలంలోని విద్యార్థుల సంఖ్య 5600
- మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 5 పోస్టుల చొప్పున ఖాళీగా ఉన్నాయి.
- మండలంలోని యూపీ ఆశ్రమ పాఠశాలల్లో 1 నుంచి 8 తరగతులు నడుస్తుండగా 8 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా, ఆయా పాఠశాలల్లో కేవలం ముగ్గురు చొప్పున మాత్రమే పనిచేస్తున్నారు.
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది.

మండలం: అరకులోయ

మండలంలో- 150 పాఠశాలలు.
మొత్తం విద్యార్థులు- 12,443
ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలు: -15

అరకులోయ మండంలోని లోతేరు పంచాయతీ టి.డి.గూడ ఎంపీఎస్ పాఠశాల, మాడగడ పంచాయతీ కుమ్మరిపేడిఐ టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, చినలబుడు పంచాయతీ కరాయిగూడ టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, సుంకర మెట్టా పంచాయతీ తిరిబంద టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, చినలబుడు పంచాయతీ మాలివలస టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, మాడగడ పంచాయతీ బెంజిపూర్ కాలనీ, టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, సుంకరమెట్ట పంచాయతీ దండబాడు టీడబ్ల్యూఎస్ ప్రాథమకి పాఠశాల, మాడగడ పంచాయతీ దళపతి గూడలో టీడబ్ల్యూఎస్ ప్రాథకి తదితరుల ఉపాధ్యాయుల కొరత ఉంది.

మండలం: డుంబ్రిగుడ

- డుంబ్రిగుడ మండలంలో 145 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర, బాలికల పాఠశాలలు, 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏకలవ్య పాఠశాల ఒకటి, ఒక కెజిబివి పాఠశాలలు ఉన్నాయి.
- మండలంలోని మొత్తం విద్యార్థుల సంఖ్య- 9663
- మధ్యాహ్నం భోజన పథకం అన్ని పాఠశాలల్లో సక్రమంగా జరుగుతుంది.
- విద్యా కానుక కిట్లు విద్యార్థులందరికీ పంపిణీ జరిగింది.
- 13 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- 15 ప్రాథమిక పాఠశాలల్లో భవనాలు లేవు.

మండలం: అనంతగిరి

- మండలంలోని మొత్తం పాఠశాలలు- 174
- మండలంలోని విద్యార్థులు- 9543
- మధ్యాహ్నం భోజన పథకం అన్ని పాఠశాలల్లో సక్రమంగా జరుగుతుంది.
- ఉపాధ్యాయుల కొరత ఉంది.

మండలం: పెదబయలు

- మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 177 పాఠశాలల్లో 11,600 మంది విద్యార్థులున్నారు.
- మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు జరుగుతుంది.
- మండలంలో 12,149 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ జరిగింది.
- మండలంలో అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశం పొందిన 1,500 మంది విద్యార్థులకు కిట్లు అందడం లేదు.
- మండలంలోని ఏడు పాఠశాలలు ఉపాధ్యాయులు లేకపోవడంలో ఇటీవల ఇతర పాఠశాలల నుంచి సర్దుటాటు చేశారు.

మండలం: రంపచోడవరం

- మండలంలోని పాఠశాలలు సంఖ్య - 47
- మండల వ్యాప్తంగా 336 మంది విద్యార్థులున్నారు.
- మండలంలో నాలుగు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులు
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది.

మండలం: గూడెం కొత్తవీధి

- మండలంలో మొత్తం పాఠశాలల సంఖ్య :196
- మండలంలో విద్యార్థుల సంఖ్య. 11,254
- మండలంలో ఉపాధ్యాయుల సంఖ్య-420
- మండలంలో ఎ.బారకొండ, పి.సింగవరం. వర్తనపాడు, ఆకులూరు, గ్రామాల్లోని నాలుగు పాఠశాలల్లో, ఉపాధ్యాయుల కొరత ఉంది.
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది.

మండలం: హుకుంపేట

- మండలంలోని పాఠశాలల సంఖ్య: 216
- విద్యార్థుల సంఖ్య:10,412
- బాలికలు: 50,341
- బాలురు: 5071
- మండలంలోని ఉపాధ్యాయుల సంఖ్య: 486
- ఉపాధ్యాయుల కొరత సంఖ్య: 8
- జగనన్న విద్యా కానుక 10,261 మంది విద్యార్థులందరికీ అందించారు.
- మండలంలోని తోతకూరపాడు, దారబందలు, సరలం గ్రామాల్లో కనీసం పాఠశాలలు లేవు.

మండలం: గంగవరం

- మండలంలోని మొత్తం పాఠశాలలు- 61
- మండల వ్యాప్తంగా విద్యార్థులు - 3363
- విద్యార్థులందరికీ విద్యా కానుక కిట్లు అందజేశారు.
- మండలంలోని టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలకు అదనపు తరగతి గదులు అవసరం
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది.

మండలం: చింతూరు

- మొత్తం పాఠశాలలు- 106
- మొత్తం విద్యార్థులు- 7,200 మంది
- మండల వ్యాప్తంగా ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల్లో 27 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఉన్నాయి.
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది.

మండలం: వై.రామవరం

- మండలంలో పాఠశాలలు- 130
- మొత్తం 4,970 మంది విద్యార్థులు
- మండలంలో సుమారు వెయ్యి మందికి విద్యాకానుక కిట్లు, యూనిఫాంలు అందలేదు.
- సుమారు 180 మంది టీచర్ల కొరత ఉంది.

మండలం: ముంచంగిపుట్టు

- ముంచంగిపుట్టు:మండలంలో 206 పాఠశాలల్లో 9,559 మంది విద్యార్థులు చదువుతున్నారు
- 15 పాఠశాలలకు ఉపాధ్యాయులు లేరు. పలు పాఠశాలలో ఇద్దరు, ముగ్గరు ఉపాధ్యాయులు ఉంటే వారిని పాఠశాలలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు సర్దుబాటు చేశారు.
- మండలంలో 9,756 మంది విద్యార్థులు ఉండగా విద్యా కానుక కిట్లులో యూనిఫామ్, నోట్,ట్రైస్ట్ బుక్స్,షూస్,బెల్ట్‌లు విద్యార్థులకు అందజేశారు.
- మండల వ్యాప్తంగా 3,486 మందికి మాత్రమే బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు.ఇంకా 6,270 మందికి బ్యాగులు అందించాల్సి ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మాత్రం బిల్లులు అవడం లేదు.

తల్లికి వందనం కోసం ఎదురు చేస్తున్నాం..



కూటమి ప్రభుత్వం.. తల్లికి వందనం పథకంతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున డబ్బులు వేస్తామన్నారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలు అవుతున్నా ఆ ఊసేలేదు. తొందరగా ఆ డబ్బులు వేస్తారని ఆశపడుతున్నాం. నాకు ఇద్దరు పిల్లలు, పెదబాబు పదోతరగతి, చినబాబు ఆరోతరగతి చదువుతున్నారు. ఇద్దరికీ కలిపి రూ.30 వేలు వేయాలి. – **అల్లంగి మౌనిక, విద్యార్థి తల్లి** లకేయిపుట్టు గ్రామం, పెదబయలు మండలం.

ఉపాధ్యాయులను నియమించాలి



మా గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో బోధన కష్టతరంగా ఉంది. రెండు తరగతులను కలిపి ఒక్కోసారి ఒకే ఉపాధ్యాయుడితో పాఠాలు బోధిస్తున్నారు. దాంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించాలి.

– **కిచ్చలి విశ్వమ్మ, వై.రామవరం**

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ఆందోళన



అందోళన చేస్తున్న భూసిపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: వైద్యం కోసం పదుల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వెంటనే పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భూసిపుట్టు గ్రామ గిరిజనులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ మంజూరు చేసి వైద్య సేవలు చేరువ చేయాలంటు పలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా భూసిపుట్టు గ్రామస్తులు సురేష్‌కుమార్, తిరుపతి, గణపతి, ధనుర్జయ్‌లు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారి సౌకర్యం కలిగిందని, రాకపోకలకు మార్గం సుగుమం అయిందన్నారు. అయితే వైద్య సేవలు పొందేందుకు మాత్రం అవస్థలు తప్పడం లేదన్నారు. భూసిపుట్టు, కుమడ, జామిగూడ, గిన్నెలకోట పంచాయతీలకు చెందిన గిరిజనులు వైద్య సేవల కోసం 20 కిలోమీటర్లు వరకు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో మార్గం మధ్యలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. రోగులను రూడకోట, ముంచంగిపుట్టు ఆస్పత్రులకు తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే నాలుగు పంచాయతీలకు చెందిన 80గ్రామాల గిరిజనుల వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు భూసిపుట్టులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. గ్రామస్తులు మిన్నారావు, మోహన్‌రావు, త్రినాథ్, సుబ్బారావు, అనిల్ కుమార్, సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు

హుకుంపేట: ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాపుల కృష్ణారావులు కోరారు. ఈ మేరకు ఈనెల 9న నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 8వరకు ఆదివాసీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివాసీల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల సిబ్బంది కొట్టగుళ్లి సింహాచలం, గిరిజన సంఘం నాయకులు లింగమూర్తి, నరసింహమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించిన రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

అడ్డతీగల: మండలంలోని గొంటువానిపాలెం-తిమ్మాపురం మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ రోడ్డులో గోతుల వల్ల వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు ముందుగా గోతులను పూడ్చే పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేస్తామన్నారు. అనంతరం తిమ్మాపురం వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేయించారు.నాయకులు విజయభాస్కర్, తాతారావు, హరిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు

మారేడుమిల్లి: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘటనలో కారు వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను, ఆ తరువాత కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కరీంనగర్‌కు చెందిన రాజేష్, సాయికిరణ్ మారేడుమిల్లికి విహార యాత్రకు వచ్చారు. వారు స్థానిక గెస్ట్ హౌస్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా చాగల్లుకు చెందిన కారు ఎదురుగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. కారులో నలుగురు వ్యక్తులు ఉన్నారు. అనంతరం కారు అదుపు తప్పి అక్కడే ఉన్న కరెంటు స్తంభం ఢీకొంది. స్తంభం విరిగిపోయింది. కారులో ఉన్న అశోక్, రవి, మోటారు బైక్‌పై వెళుతున్న రాజేష్, సాయికిరణ్ గాయాలపాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు.

ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక దృష్టి



సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన వారపు సంతలో ఆదివారం సీఐ వెంకటరమణ, ఎస్ఐ లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టారీత్యా నేరమన్నారు. గిరిజనులు గంజాయి సాగును వీడాలన్నారు. వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా ఎస్పీ బర్దర్ ఆదేశాల మేరకు గిరిజనులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గంజాయి జోలికి ఎవరు వెళ్లొదన్నారు. ఈ కారణంగా జీవితాలు నాశనమవుతాయన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. లక్ష్యం ఏర్పాటుచేసుకొని తదనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు పరికరాల పంపిణీ

పాడేరు: ప్రకృతి వ్యవసాయం చేసే గిరిజన రైతులు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీ మిత్ర స్వచ్ఛంద సంస్థ సీఈవో మన్మథరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆదివాసీ మిత్ర స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో 65 మంది రైతులకు సులభ పద్ధతిలో వినియోగించే వ్యవసాయ పరికరాలైన సైకిల్, కినోవీడర్లను అందజేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించాలని ఆకాంక్షించారు. వ్యవసాయంలో తేలికపాటి యంత్రాలను వినియోగించాలని సూచించారు. వంజంగి పంచాయతీ సర్పంచ్ బొంజుబాబు మాట్లాడుతూ ప్రకృతి సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ షాలిని, లీడ్ ఫార్మర్లు, ఆదివాసీ మిత్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.